సాక్షి
నిర్మల్
గురువారం । 11 । మే । 2023



ఉత్తుత్తి శిక్షణ
వేసవి సెలవుల్లో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యం లో రాష్ట్రవ్యాప్తంగా నెలపాటు క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 16, పట్టణ ప్రాంతంలో ఐదు శిబిరాల ఏర్పాటుకు అనుమతించారు. 8లో▸



భళా.. చిన్నారుల నాట్యకళ
జిల్లా కేంద్రానికి చెందిన పలువురు చిన్నారులు చదువుతోపాటు సంప్రదాయ నృత్యంలో రాణిస్తు న్నారు. వివిధ వేదికలపై అభినయంతో ఆకట్టు కుంటున్న చిన్నారులపై 'సాక్షి' కథనం. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
41.0 /26.0

వాతావరణం
ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. మధ్నాహ్నం ఉక్క పోత ఎక్కువవుతుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

ఓటరు జాబితాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో స్రవంతి

నిర్మల్‌చైన్‌గేట్: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో స్రవంతి బుధవారం తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఓటరు జాబితాపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గంలో పారదర్శక ఓటరు జాబితాకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదు కావాలని సూచించారు. జనవరి 5, 2023 నాటికి రూపొందించిన ఓటరు జాబితాలను రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలించాలని కోరారు. ఓటరు జాబితాలో తొలగించిన ఓటర్ల వివరాలు మరోసారి పునః పరిశీలించాలని, ఆరు కంటే ఎక్కువ ఓటర్లున్న ఇంటిని తనిఖీ చేసి వాటిలో ఏమైనా మార్పులుంటే సరి చేయాలని సూచించారు.

కూలీలకు వసతులు కల్పించాలి



మన్మద్‌లోని నర్సరీని పరిశీలిస్తున్న విజయలక్ష్మి

లోకేశ్వరం: ఉపాధిహామీ పని స్థలాల్లో కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. బుధవారం మండలంలోని మన్మద్, కన్కాపూర్, జోహర్‌పూర్, వట్టోలి, అర్లి–గొడిసెరా, ధర్మోర, పంచగుడి గ్రామాల్లోని నర్సరీలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో కూలీలు ఉదయాన్నే పనులకు వెళ్లాలన్నారు. ప్రతీ గ్రామంలో కిచెన్ షెడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో సల్మాన్‌రాజ్, ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్, టీఏలు మంజుల, రవీందర్, శారద, హరిత ఉన్నారు.

బస్టాండ్‌లో ప్లాట్‌ఫామ్‌ల మార్పు

నిర్మల్ టౌన్: నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్‌లోని ప్లాట్ ఫాంలలో పలు మార్పులు చేసినట్లు డిపో మేనేజర్ సాయన్న బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 12వ తేదీ నుంచి మార్పునకు అనుగుణంగా బస్సులు ఆగుతాయని పేర్కొన్నారు. ట్రాఫిక్ జామ్ దృష్ట్యా ఆదిలాబాద్, నాగపూర్ బస్సులు ఆగే ప్లాట్ ఫామ్ ఒకటి నుంచి ఎనిమిదో నంబర్ ప్లాట్‌ఫామ్‌కు మార్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎనిమిదో నంబర్ ప్లాట్‌ఫామ్ వద్ద ఆగే ఖానాపూర్, మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, రాయికల్, కాగజ్‌నగర్, మంచిర్యాల బస్సులను ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్‌కు మార్చినట్లు తెలిపారు. రెండో నంబర్‌పై ఉన్న నేరేడుగొండ, ఇచ్చోడ, ఆదిలాబాద్ ఆర్డినరీ స్టాప్‌ను ఏడో నంబర్‌కు, మూడో నంబర్‌పై ఉన్న గుడిహత్నూర్ స్టాప్‌ను ఆరుకు, నాలుగో నంబర్‌పై ఉన్న బోథ్, సోనాల, కిన్వాట్ స్టాప్‌ను ఐదుకు, ఐదుపై ఉన్న బాబాపూర్, కంజర్, పరిమండల్ స్టాప్‌ను నాలుగుకు, ఆరుపై ఉన్న పారుపెల్లి, మునిపెల్లి, చింతల్‌చాంద, లక్ష్మణచాంద, గుమ్మడియల, కొరటికల్, కమల్‌కోట్ స్టాప్‌ను మూడుకు, ఏడుపై ఉన్న ఖానాపూర్, సోమరిపేట్, మద్దిపడగ, గంగాపూర్ స్టాప్‌ను రెండో నంబర్ ప్లాట్‌ఫామ్‌లకు మార్చినట్లు పేర్కొన్నారు. మార్పును ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

ఆయిల్‌పామ్ సాగు మరింత పెంచాలి

లక్ష్మణచాంద: జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు మరింత పెంచాలని ఉద్యానవనశాఖ రిటైర్డ్ కమిషనర్ వెంకట్రామ్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ, వ్యవసాయ శాఖల సౌజన్యంతో మండల రైతులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒక్క కూలీతోనే ఎకరం సాగు చేయవచ్చని, వన్యప్రాణుల బెడద కూడా ఉండదని తెలిపారు. గోదావరి పరీవాహక ప్రాంతాలు సాగుకు అనుకూలమని చెప్పారు. సోన్ మండలం పాక్‌పట్ల గ్రామంలో రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.400 కోట్లతో ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నారని, మార్కెటింగ్‌కు ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. ఎకరాకు రూ.లక్షన్నర ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సబ్సిడీ, మార్కెటింగ్, సాగులో మెలకువలు తదితర అంశాలను రైతులకు వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, జిల్లా ఉద్యానవన అధికారి శ్యామ్‌రావ్‌రాథోడ్, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వినయ్‌బాబు, డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్, సర్పంచ్ ముత్యంరెడ్డి, ఏవో ప్రవీణ్‌కుమార్, నర్సాపూర్ ఎంపీటీసీ గణేశ్, ఎంపీడీవో మోహన్, ఈ రైతు ఎండీ రమణారావు, ఆయిల్‌పామ్ ఫ్రీ యూనిక్ కంపెనీ డీజీఎం రాంప్రసాద్, మామడ రైతుబంధు అధ్యక్షుడు గంగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పదిలో మనమే ఫస్ట్

- రాష్ట్రంలో అగ్రస్థానంలో జిల్లా
- 99శాతం విద్యార్థుల ఉత్తీర్ణత
- గతేడాదికంటే మరింత మెరుగు
- హర్షం వ్యక్తంజేసిన మంత్రి అల్లోల
- అధికారులకు మంత్రి అభినందన



కలెక్టర్ వరుణ్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్‌రూరల్: చదువుల తల్లి కొలువైన నిర్మల్ జిల్లా పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటి చరిత్ర సష్టించింది. తొలిసారి రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఏడాదికేడాది ఒక్కోస్థానం పైకి వస్తూ ఈసారి ఏకంగా మొదటి స్థానంలో నిలవడం విశేషం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి విడిపోయిన తర్వాత నిర్మల్ విద్యారంగంలో దినదినాభివృద్ధి చెందుతోంది. ఇందుకు మొన్న ఇంటర్, నిన్న పదో తరగతి ఫలితాలే నిదర్శనం. రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రోత్సాహం, జిల్లా అధికారుల సహకారం, ఉపాధ్యాయ బృందం ప్రణాళిక, విద్యార్థుల పట్టుదల వెరసి జిల్లాను పదో తరగతి ఫలితాల్లో ఫస్ట్‌గా నిలబెట్టాయి. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడులు సత్తా చాటాయి. కార్పొరేట్ స్థాయిలో ఫలితాలు సాధించాయి. బుధవారం విడుదలైన ఫలితాల్లో రాష్ట్రంలో నిర్మల్ జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. విద్యార్థుల పట్టుదల, ఉపాధ్యాయుల ప్రోత్సాహం తోడై జిల్లాలో 99 శాతం మంది పాసయ్యారు. గతేడాది 97.73% తో రాష్ట్రంలో రెండో స్థానం నిలవగా ఈసారి అగ్రపథాన నిలవడం విశేషం.

ఫలితాల్లో కొత్త రికార్డులు

పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించారు. మూల్యాంకనం వివిధ కేంద్రాల్లో ఏప్రిల్ 13 నుంచి 21వ తేదీ వరకు చేపట్టారు. ఈసారి ఫలితాల్లో జిల్లా విద్యార్థులు కొత్త రికార్డులు నెలకొల్పారు. మొత్తం 9,071 మంది విద్యార్థులకు 8,980 మంది (99%) విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. బాలురు 4,442 మందికి గాను 4,392 మంది (98.87%) పాసవగా, 4,629 మంది బాలికలకు 4,588 మంది (99.11%) ఉత్తీర్ణులయ్యారు. గతేడాది 9,642 మంది విద్యార్థులకు 9,423 మంది (97.73%) పాసవగా.. అప్పుడు జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది.

ఫలించిన ప్రణాళిక

జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు కలిసి ప్రణాళిక ప్రకారం పనిచేయడంతో ఫలితాల్లో జిల్లా అగ్రస్థానాన నిలిచింది. పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ఫలితాల కోసం కలెక్టర్ వరుణ్‌రెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేశారు. ఈ తరగతుల్లో రోజుకు ఓ సబ్జెక్టు టీచర్‌తో ప్రత్యేక పాఠాలు, రివిజన్, స్లిప్ టెస్టులు నిర్వహించారు. వివిధ ఎన్జీవో సంఘాలు, తల్లిదండ్రులు, ఇతర వర్గాల నుంచి విరాళాలు సేకరించి ప్రతీరోజు ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులకు రాగి జావా, స్నాక్స్ అందించారు. రెండుసార్లు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించి జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో డీఈవో రవీందర్‌రెడ్డి సబ్జెక్టుల వారీగా ఆయా ఉపాధ్యాయులతో ఫలితాలపై రివ్యూ నిర్వహించి పలు సూచనలు చేశారు. గతేడాది 70% సిలబస్‌తో వార్షిక పరీక్షలు నిర్వహించగా, ఈసారి 100% సిలబస్ డిసెంబర్ 31 కల్లా పూర్తి చేసి మూడు నెలల పాటు రివిజన్ చేసి మార్చిలో వార్షిక పరీక్షలు నిర్వహించారు. ఈసారి ఆరు పరీక్షలు మాత్రమే ఉండడంతో విద్యార్థులకు సమయాభావం కలిసి వచ్చి, సబ్జెక్టుపై పట్టు వచ్చిందని ఉపాధ్యాయ వర్గాలు పేర్కొంటున్నాయి.

మంత్రి అల్లోల అభినందనలు

పదో తరగతి ఫలితాల్లో జిల్లా అగ్రస్థానం సాధించడంతో రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరికి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని.. ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాలని.. గతంలో పలు సూచనలు చేశారు. ప్రతీ ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ముందుకెళ్లాలని సూచించారు. వచ్చే ఏడాది కూడా మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే జిల్లాలోని వివిధ ఉపాధ్యాయ



డీఈవోను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సంఘాల నాయకులు డీఈవో రవీందర్‌రెడ్డిని బుధవారం ఆయన కార్యాలయంలో కలిసి సన్మానించారు. పీఆర్టీయూ, ఎస్టీయూ, తపస్, టీఎస్, యూటీఎఫ్ తదితర ఉపాధ్యాయ సంఘాల నాయకులు డీఈవోను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

సత్తా చాటిన సర్కార్ బడులు

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ బడులు సత్తా చాటాయి. జిల్లాలో మొత్తం 166 ప్రభుత్వ బడులు ఉండగా 93 పాఠశాలల్లో 100 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జిల్లావ్యాప్తంగా 80 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. 18 కేజీబీవీల్లో 14 చోట్ల 100 శాతం మంది విద్యార్థులు పాసయ్యారు. కుంటాల మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, ఐదు మైనార్టీ వెల్ఫేర్ పాఠశాలలు, ఎనిమిది టీఎస్‌ఎస్‌డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ పాఠశాలల్లో 100% ఉత్తీర్ణత నమోదైంది.

కలెక్టరేట్‌లో సంబురాలు

పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో జిల్లాకు ప్రథమ స్థానం రావడంతో కలెక్టరేట్‌లో సంబురాలు నిర్వహించారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంచారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేసిన డీఈవో, ఉపాధ్యాయులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

పుట్టెడు దుఃఖంతో పరీక్ష రాసి పాసయ్యాడు



కడెం: దుఃఖాన్ని దిగమింగి.. పదో తరగతి పరీక్షలు రాసి పాసయ్యాడు మండలంలోని పెద్దబెల్లాల్ గ్రామపంచాయతీ పరిధి మొర్రిగూడెం గ్రామానికి చెందిన తక్కల రోహిత్. తెల్లవారితే పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానుండగా అంతలోనే తండ్రి అనారోగ్యంతో మరణించాడు. దీంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. బంధువులు ధైర్యం చెప్పడంతో రోహిత్ పరీక్షలు రాశాడు. బుధవారం విడుదల చేసిన ఫలితాల్లో 8.8 జీపీఏ సాధించాడు.

పనులు త్వరగా చేపట్టాలి



భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలో చేపట్టిన భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. బుధవారం ఎల్లపెల్లి సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు, చించోలి సమీపంలో చేపట్టిన మైనార్టీ కాలేజీ భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పనుల్లో నాణ్యతను పాటిస్తూ సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో స్రవంతి కాంట్రాక్టర్ జగన్మోహన్‌రెడ్డి వివిధ శాఖల అధికారులున్నారు.

జాప్యం లేకుండా కొనాలి

మామడ: రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని జాప్యం లేకుండా కొనుగోలు చేయాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం మండలంలోని మామడలో వరి ధాన్యం, మొక్కజొన్న, కొరిటికల్, న్యూసాంగ్వి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీ లించారు. మామడలో వరి ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించి కొనుగోళ్లలో ఎందుకు జాప్యం చేస్తున్నారని కొనుగోలు కేంద్రం నిర్వాహకులను ప్రశ్నించారు. కూలీల కొరతతో కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని నిర్వాహకులు తెలిపారు. కూలీల కొరతను అధిగమించాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా, నిబంధనలకు అనుగుణంగా కొనుగోళ్లను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం న్యూసాంగ్విలో బృహత్ పల్లెప్రకృతివనం, లింగాపూర్ గ్రామంలో పానికి వనం పెంచేందుకు సిద్ధం చేసిన స్థలాన్ని పరిశీలించారు. ఎంపీడీవో రమేశ్, మామడ సర్పంచ్ హన్మాగౌడ్ తదితరులున్నారు.

దొరికిన ఫోన్లు అప్పగింత

నిర్మల్‌టౌన్: ఫోన్లు పోగొట్టుకున్న బాధితులిద్దరికీ తిరిగి వాటిని అప్పగించినట్లు పట్టణ ఎస్సై అర్పిత్ తెలిపారు. కుభీర్ మండలం సోనాలి గ్రామానికి చెందిన సయ్యద్ అహెద్, సోన్ మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన నక్క ఎల్లవ్వ పని నిమిత్తం పట్టణానికి వచ్చి ఏప్రిల్ 2న నిర్మల్ బస్టాండ్‌లో ఫోన్లు పోగొట్టుకున్నారు. దీంతో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కొత్తగా వచ్చిన సీ ఈఐఆర్ టెక్నాలజీని ఉపయోగించి ఫోన్లను కనిపెట్టి, బాధితులకు బుధవారం జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు.

పట్టువీడని 'పంచాయతీ'



జిల్లాకేంద్రంలో వానలో సమ్మె చేస్తున్న జేపీఎస్‌లు

- వెనక్కి తగ్గని కార్యదర్శులు
- గడువులోగా జాయిన్‌కు 'నో'
- రెగ్యులరైజ్ చేసేదాకా ఉద్యమిస్తామని తేల్చిచెప్పిన జేపీఎస్‌లు

నిర్మల్: మూడేళ్లపాటు ప్రభుత్వం పేర్కొన్న ప్రకారం పనిచేశామని, సర్కారు కూడా ఇచ్చిన మాట ప్రకారం తమను రెగ్యులరైజ్ చేయాలని జూనియర్ పంచాయతీ సెక్రటరీలు కోరుతున్నారు. తమను క్రమబద్ధీకరించేవరకూ వెనక్కు తగ్గేదిలేదని తేల్చిచెబుతున్నారు. ప్రభుత్వం సమ్మె వీడి ఈనెల 9న సాయంత్రం వరకు జాయిన్ కావాలంటూ ఇచ్చిన గడువునూ వారు లెక్కచేయలేదు. జిల్లాలో ఒకరిద్దరు మినహా ఎవరూ జాయిన్ కాలేదు. మళ్లీ తాము వెట్టిచాకిరీ చేయలేమని, రెగ్యులరైజ్ చేస్తేనే విధులకు హాజరవుతామంటున్నారు.

జాయిన్ కాలేదు..

జిల్లాలో కొనసాగుతున్న ఆందోళనలో 322మంది పంచాయతీ సెక్రటరీలు ఉన్నారు. ఇందులో 11మంది అవుట్‌సోర్సింగ్ కాగా, మిగతా 311మంది జేపీఎస్‌లు. గత 13రోజులుగా నిర్మల్ డివిజన్‌కు సంబంధించి కలెక్టరేట్ ఎదుట, భైంసా డివిజన్‌కు సంబంధించి స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వం ఎలాగైనా జేపీఎస్‌లు డ్యూటీలో జాయిన్ కావాలని ఆదేశించింది. ఇందులో భాగంగా జేపీఎస్‌లపై అన్నిరకాలుగా ఒత్తిడి తీసుకువచ్చింది. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కూడా జిల్లాల్లోని జేపీఎస్‌లతో నేరుగా మాట్లాడారు. తమను రెగ్యులరైజ్ చేస్తేనే విధుల్లో చేరుతామని జేపీఎస్‌లు స్పష్టంచేశారు. ఈక్రమంలో జేపీఎస్‌లు తమ జాయినింగ్ సందర్భంగా పేర్కొన్న నిబంధనలు ఉల్లంఘించారని, ఈనెల 9న సాయంత్రంలోపు తిరిగి విధుల్లో చేరాలని ప్రభుత్వం ఆదేశించింది. అయినా వారు లెక్కచేయకుండా ఎండావానల్లోనూ సమ్మె కొనసాగిస్తున్నారు.

పరీక్ష పెట్టి..

ప్రభుత్వం కొత్త పంచాయతీలను ఏర్పాటుచేయడంతో కార్యదర్శుల అవసరం ఏర్పడింది. ఈక్రమంలో 2018 ఆగస్టులో జూనియర్ పంచాయతీ సెక్రటరీల ఎంపికకు నోటిఫికేషన్ వేసింది. పరీక్ష పెట్టి అందులో అర్హత పొందిన వారికి 2019 ఏప్రిల్‌లో పోస్టింగ్‌లు కేటాయించింది. జాయినింగ్‌కు ముందే వారికి నిబంధనలు పెట్టడంతో పాటు మూడేళ్ల సర్వీసు తర్వాత తమను గ్రేడ్–4గా గుర్తిస్తామని పేర్కొన్నట్లు జేపీఎస్‌లు చెబుతున్నారు. తమకు ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులరైజ్ చేయకుండా మళ్లీ ఏడాదిపాటు ప్రొహిబిషన్ కాలాన్ని పెంచారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా తమను క్రమబద్ధీకరించాలంటూ ఏప్రిల్ 28నుంచి సమ్మెకు దిగారు.

అన్ని పనులూ వాళ్లే..

ఊళ్లో ఏ పని కావాలన్నా..'ఆ పంచాయతీ సెక్రటరీకి ఫోన్ చేయండయ్యా..' అంటూ అధికారులు అంటుంటారు. ఆ పని, ఈ పని అని కాదు.. అన్ని పనులూ వారితోనే చేయించారు. కరోనా కాలంలోనూ జేపీఎస్‌లు ప్రాణాలకు తెగించి, పాజిటివ్ వచ్చిన వారి ఇళ్లకు వెళ్లి ఆహారం, నీళ్లు అందించడం, వారు బయట తిరగకుండా కాపలా కాయడం వంటి పనులు చేశారు. ఇక ప్రభుత్వం ఏ పని చేపట్టినా దాన్ని క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యదర్శుల పైనే వేస్తోంది. పని ఎక్కువ, జీతం తక్కువ.. దీనికి తోడు తమను రెగ్యులరైజ్ చేయడం లేదన్న బాధతోనే సమ్మెకు దిగినట్లు వారు వాపోతున్నారు. తమలో చాలామంది ఉన్నత చదువులు చదివామని, మూడేళ్ల క్రితం సరైన నోటిఫికేషన్లు లేక ఇందులోకి వచ్చామంటున్నారు. ఇప్పటికైనా తమను రెగ్యులరైజ్ చేసి న్యాయం చేయాలని కోరుతున్నారు.

రెగ్యులరైజ్ చేయాలి



ప్రభుత్వం ఆదేశించిన ప్రతి పనినీ మా గ్రామాల్లో పూర్తిచేశాం. ఎక్కడా నిబంధనలు దాటకుండా ప్రొహిబిషన్ కాలాన్ని పూర్తిచేశాం. ఇప్పటికైనా మమ్మల్ని ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసి న్యాయం చేయాలి.
– జయలక్ష్మి, జేపీఎస్

కొత్త డిమాండ్ కాదు



మేము చేస్తున్నది కొత్త డిమాండ్ కాదు. మాకు ఇచ్చిన హామీ ప్రకారమే మమ్మల్ని రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మాకు భరోసా ఇవ్వాలి.
– సంధ్య, జేపీఎస్

నిబంధనల ప్రకారమే..



ప్రభుత్వం పేర్కొన్న ప్రకారమే మేము పంచాయతీల్లో విధులు నిర్వర్తించాం. ఏ పని చెప్పినా చేసుకుంటూ వచ్చాం. ఇప్పుడు కూడా నిబంధనల ప్రకారమే మా డిమాండ్‌ను పరిశీలించాలని కోరుతున్నాం. – రాజువర్మ, జేపీఎస్

మూడేళ్లకు పైగా..



జూనియర్ పంచాయతీ సెక్రటరీగా మూడేళ్లకు పైగా సేవలందించాం. మమ్మల్ని రెగ్యులరైజ్ చేస్తారన్న నమ్మకంతోనే మేమంతా ఇతర ఉద్యోగాలకు ప్రయత్నం చేయలేదు. వెంటనే రెగ్యులరైజ్ చేయాలి. – శ్రీనివాస్, జేపీఎస్

భవన నిర్మాణానికి భూమిపూజ

ఖానాపూర్: మండలంలోని పాతఎల్లాపూర్‌లో రూ.2లక్షలతో నిర్మించే ఎస్సీ భవన నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే రేఖానాయక్ భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. చంద్రయ్య, శంకర్, రాజేశ్వర్, శ్రీనివాస్, రాజేందర్, గజేందర్ ఉన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే



నిర్మల్: మంచిర్యాలరోడ్డులో కూలిన గోడ



లక్ష్మణచాంద: పొట్టపెల్లిలో తడిసిన వరి ధాన్యం

మళ్లీ గాలివాన

నిర్మల్: జిల్లాకేంద్రంతో పాటు పలు మండలాల్లో మళ్లీ గాలివాన పరేషాన్ చేసింది. మంగళ, బుధవారాల్లో మధ్యాహ్నం సమయంలో జోరుగా ఈదురుగాలులతో కూడిన భారీ వానలు కురిశాయి. జిల్లా కేంద్రంలో బుధవారం ఈదురుగాలులకు మంచిర్యాలరోడ్డులో నిర్మాణంలో ఉన్న ఓ భారీ కాంప్లెక్స్ గోడ పడిపోయింది. దీంతో ఇద్దరికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. అలాగే భైంసారోడ్డులో పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి.

లక్ష్మణచాంద మండలంలో..

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి కే గ్రామంలో వర్షం బీభత్సం సృష్టించింది. బుధవారం సాయంత్రం 3గంటలకు కురిసిన భారీ వర్షం నష్టాన్ని మిగిల్చింది. వరి ధాన్యం పూర్తిగా తడిసి ముద్దైంది. పొట్టపెల్లి గ్రామం వద్ద కురిసిన భారీ వర్షానికి గ్రామం నుంచి లక్ష్మణచాంద వైపు వెళ్లే ప్రధాన రహదారిపై భారీ వృక్షాలు రోడ్డుపై అడ్డంగా పడిపోయాయి. దీంతో మండల కేంద్రానికి రాకపోకలు రెండుగంటల పాటు నిలిచాయి. పలు కాలనీల్లో చెట్లు పడిపోయాయి. సర్పంచ్ హైమావతి, ఎస్సై రాహుల్ గైక్వాడ్ చొరవతో జేసీబీతో చెట్లను తొలగించడంతో రాకపోకలు మళ్లీ కొనసాగాయి. గ్రామంలో 14 విద్యుత్ స్తంభాలు, మూడు ట్రాన్స్‌ఫార్మర్లు విరిగిపోయాయి. గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచింది. సమాచారం అందుకున్న విద్యుత్ అధికారులు యుద్ధప్రాతిపదికన గ్రామంలో విద్యుత్‌ను పునరుద్ధరించేందుకు పనులు చేపడుతున్నారు.

అప్పుడే ఎండ.. అప్పుడే వాన



వారంరోజులుగా వాతావరణ పరిస్థితులు గందరగోళంగా మారాయి. వేసవిలో అకస్మాత్తుగా వర్షం కురుస్తుండగా అప్పుడే ఉక్కపోత, మరికాసేపట్లో ఈదురు గాలులతో కూడిన భారీవర్షం, ఆ తర్వాత ఎండతీవ్రత ఉంటోంది. జిల్లాకేంద్రంతోపాటు పలుప్రాంతాల్లో ఇదే తరహా వాతావరణ పరిస్థితులు నెలకొనడంతో ప్రజలు ఇలాంటి పరిస్థితులు మునుపెన్నడూ చూడలేదని చర్చించుకుంటున్నారు. రైతులు, వ్యాపారులు, సాధారణ ప్రజానీకం పలు ఇక్కట్లకు గురవుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



క్లుప్తంగా

మత్తడివాగులో దూకి యువకుడి ఆత్మహత్య

తాంసి: తల్లిదండ్రులు మందలించారని మత్తడి వాగులో దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... వడ్డాడి గ్రామానికి చెందిన ఇప్ప అక్షయ్(20) జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పారా మెడికల్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. కొన్ని రోజులుగా కళాశాలకు వెళ్లకుండా మద్యానికి బానిసై తిరుగుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తల్లిదండ్రులు మద్యం మానేయాలని మందలించారు. దీంతో అదే రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. గ్రామ సమీపంలోని మత్తడివాగు ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం ప్రాజెక్టులో మృతదేహాన్ని గుర్తించిన గంగాపుత్రులు గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపారు.


అక్షయ్ (ఫైల్)

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రణదీవేనగర్‌కు చెందిన శిరీష(20) బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... శిరీష డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. చదువుకోకుండా పదే పదే టీవీ చూడడంతో తండ్రి గంగన్న మందలించాడు. మనస్తాపంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

'బోడగుట్ట' ఘటనలో ఎనిమిది మందిపై కేసు

భైంసాటౌన్: భైంసాలోని బోడగుట్టపై ఇటీవల హనుమాన్ విగ్రహం వెలుగు చూసిన ఘటనలో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎల్.శ్రీను బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. భైంసా మండలం బిజ్జూర్ గ్రామానికి చెందిన బద్దం భోజారెడ్డి అనే వ్యక్తి తన వద్ద పనిచేసే కళ్యాణ్ పాండురంగ, వేణుగోపాల్, ఆనంద్, జాదవ్ సతీష్, యోగేశ్, సూదుల సాయినాథ్, కాసరం సంతోష్ సాయంతో గుట్టపైకి హనుమాన్ విగ్రహం తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. రాజకీయంగా లబ్ధి కోసమే కలలో దేవుడు కనిపించాడంటూ ప్రజలను తప్పుదోవ పట్టించాడని తెలిపారు. ఈ మేరకు పైన పేర్కొన్నవారికి నోటీసులు అందించినట్లు వెల్లడించారు. పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

టేకు చెట్లు నరికిన నలుగురిపై కేసు

పెంబి: పెంబి రేంజ్ పరిధిలోని తాటిగూడ సెక్షన్, పుల్గంపాండ్రిలో గుండాల గ్రామానికి చెందిన షేక్ మసుద్, షేక్ ఖాజీం, అశోక్, ప్రశాంత్ అనే నలుగురు పది రోజుల క్రితం దాదాపుగా 22 చెట్లు అక్కడే ఉన్న బేస్ క్యాంపు సిబ్బంది సహాయంతో నరికారు. అధికారులు బేస్ క్యాంపు సిబ్బందిని విచారించగా గుండాల గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు నరికినట్లు తెలిపారు. దీంతో నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్‌వో రామకృష్ణ తెలిపారు. నరికిన టేకు చెట్ల విలువ రూ.3లక్షల 36వేలు ఉంటుందన్నారు. ఇందులో ఫారెస్ట్ సిబ్బంది ఉన్నారు.

ఇసుక క్వారీ తనిఖీ

చెన్నూర్: పట్టణంలోని గోదావరినదిలో ఉన్న సింగరేణి ఇసుక క్వారీని బుధవారం సింగరేణి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ హనుమంతరావు తనిఖీ చేశారు. క్వారీలో ఇసుక లిఫ్టింగ్ ప్రదేశాలు, సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు.


ఇక్కడ ఖాళీగా దర్శనమిస్తున్న వాలీబాల్ కోర్టు మావల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనిది. జిల్లా యువజన క్రీడల శాఖ ఇక్కడ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించేలా ఓ క్రీడా శిక్షకుడికి అనుమతినిచ్చింది. అయితే సదరు శిక్షకుడు, క్రీడాకారులు కానీ కనిపించని వైనం. మే 1 నుంచి 31వ తేదీ వరకు శిక్షణ ఇవ్వాల్సి ఉండగా నేటికీ ఈ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించకపోవడం అధికా రుల అలసత్వాన్ని స్పష్టం చేస్తుంది.


ఈ చిత్రంలో తాళం వేసి కనిపిస్తున్నది ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని అంకోలి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల. ఇక్కడ వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో భాగంగా కబడ్డీ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఏర్పాటు చేసినప్పటికీ క్రమం తప్పకుండా శిక్షణ నిర్వహించడం లేదు. ఉదయం, సాయంత్రం శిక్షణ ఇవ్వాల్సి ఉండగా ఉదయం మాత్రమే శిక్షణ ఇచ్చి మమ అనిపిస్తున్నారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోనే ఉన్నా అధికారుల పర్యవేక్షణ కొరవడిందనేదానికి ఈ చిత్రమే నిదర్శనం.


ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలోని బ్యాడ్మింటన్ కోర్టు ఇది. వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని కేటాయించినప్పటికీ శిక్షకుడు రాక చిన్నారులు సైతం శిక్షణ కోసం రావడం లేదు. శిక్షకుడు క్రమం తప్పకుండా వస్తే మరిన్ని మెలకువలు నేర్చుకుని మంచి క్రీడాకారులుగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని చిన్నారుల తల్లిదండ్రులు చెబుతున్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి కూతవేటు దూరంలోనే బ్యాడ్మింటన్ సమ్మర్ క్యాంప్ దుస్థితి ఇది.

ఉత్తుత్తి శిక్షణ

- వేసవి క్రీడా శిక్షణ శిబిరాలపై అలసత్వం
- తూతూ మంత్రంగా నిర్వహిస్తున్న వైనం
- శిబిరాల నిర్వహణపై పర్యవేక్షణ కరువు

ఆదిలాబాద్: వేసవి సెలవుల్లో విద్యార్థులు తమ సమయాన్ని వృథా చేసుకోకుండా క్రీడా మెలకువలను నేర్చుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఏడాది నెల రోజుల పాటు క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. 14ఏళ్ల లోపు బాల, బాలికలు మానసికంగా శారీరకంగా దృఢంగా మారడంతో పాటు క్రీడలపై వారు ఆసక్తిని పెంచుకుని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎదగాలనే లక్ష్యంతో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పలు క్రీడాంశాల్లో క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించాలని నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 16, పట్టణ ప్రాంతంలో 5 శిబిరాలు ఏర్పాటుకు అనుమతించారు. మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఈ సమ్మర్ క్యాంపులు నిర్వహించాల్సి ఉండగా, చాలా చోట్ల ప్రారంభించకపోవడం గమనార్హం.

తూతూ మంత్రంగా ప్రారంభించి..

కరోనా కన్నా ముందు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తే చిన్నారులు పెద్ద ఎత్తున తరలివచ్చేవారు. ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లోనే ఎంతో ఆసక్తిగా క్రీడల్లో సామర్థ్యాలను పెంపొందించుకొని జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడాకారులుగా ఎదిగిన వారు సైతం ఉన్నారు. ఈ దిశగా అనేక ప్రచార కార్యక్రమాలను చేపట్టేవారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి కనిపించడం లేదు. నామమాత్రంగా ప్రకటనలు విడుదల చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. అడిషనల్ కలెక్టర్ చేతుల మీదుగా శిక్షకులకు క్రీడా పరికరాలను పంపిణీ చేసిన అధికారులు, శిక్షణ శిబిరం ప్రారంభ కార్యక్రమాన్ని నామమాత్రంగా నిర్వహిస్తున్నారు.

పర్యవేక్షణకు రారు.. పట్టించుకోరు..

జిల్లాలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు ప్రభుత్వం రూ.1.05 లక్షల నిధులు కేటాయించింది. ఇందులో క్రీడా పరికరాల కొనుగోలుకు రూ.50 వేలు ఖర్చు చేయగా, ఒక్కో శిక్షకునికి రూ.4 వేల చొప్పున అందజేయనున్నారు. అదేవిధంగా ప్రాథమిక చికిత్స అందించడానికి మెడికల్ కిట్ కోసం రూ.5 వేలు, రూ.10 వేలు ఖర్చు చేయనున్నారు. క్యాంపుల కోసం ప్రభుత్వం నిధులను కేటాయించినా క్షేత్రస్థాయిలో ఈ దిశగా నడవడం లేదు. శిబిరాలు పలుచోట్ల కాగితాలకే పరిమితమవుతున్నాయి. పలుచోట్ల శిబిరాలు ప్రారంభించలేదు.


జిల్లా కేంద్రంలోని ఐపీ స్టేడియంలో చిరిగిపోయిన నెట్ వద్దే వాలీబాల్ ఆడుతున్న చిన్నారులు

సంఖ్య పెంచినా ఫలితం శూన్యమే..

క్రీడలకు పెట్టింది పేరైన జిల్లాలో వేసవి వస్తే చాలు పల్లె ప్రాంతాల్లో పదుల సంఖ్యలో శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసేవారు. కరోనా అనంతరం క్యాంపులు లేకపోవడం, చిన్నారులు రాకపోవడం శిక్షకులు సైతం అనాసక్తి ప్రదర్శించడంతో శిబిరాల ఏర్పాటు వీలు కాలేదు. కరోనా అనంతరం జిల్లాలో 10 వరకు క్రీడా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయాలని సాట్స్ నిర్ణయించింది. ఆదిలాబాద్ జిల్లాలో ఇందుకు భిన్నంగా 21 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభించాలని నిర్ణయించారు. వాలీబాల్ క్రీడకే 4 క్యాంపులు కేటాయించగా హాకీ క్రీడకు మూడు క్యాంపులను కేటాయించారు. ఇందులో ఎంతో ఆసక్తితో క్రీడా శిక్షణ ఇద్దామని ముందుకు వచ్చిన వారికి అవకాశాలు లభించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నెల 17వ తేదీ నుంచి మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించనుండగా ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో తర్ఫీదు పొందిన వారు పతకాలను సాధించి రాష్ట్ర స్థాయి వరకు వెళ్లే అవకాశం ఉండేది.

శిక్షకుడు ఉంటే బాగుంటుంది



హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాను. అక్కడ మా స్కూల్లో అన్ని ఆటలు ఆడిస్తారు. మాకు ఏ ఆటలో ఆసక్తి ఉందో ఆ ఆటలో ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. వేసవి సెలవుల్లో ఇంటికి వచ్చాను. మా పాఠశాల స్నేహితులం అంతా కలిసి రోజూ ప్రాక్టీస్ చేస్తున్నాం. అయితే మాలాంటి వాళ్ళకు ఒక శిక్షకుడు ఉంటే బాగుంటుంది. – ప్రియాష, అశోక్ రోడ్, ఆదిలాబాద్

సౌకర్యాలు కల్పించాలి



ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సౌకర్యాలు కల్పించాలి. ఇక్కడ స్టేడియంలో వాలీబాల్ శిక్షణ ఇవ్వడం లేదు. హాకీ వంటి వాటికి మాత్రమే శిక్షణ ఇస్తున్నారు. వాలిబాల్ కోర్టు సరిగ్గా లేదు. నెట్ లేదు. మేం బాల్ కూడా ఇంటి నుంచి తీసుకువచ్చి ఆడుకుంటున్నాం. తాగడానికి మంచి నీరు కూడా ఉండడం లేదు. –శ్రీకాంత్, శాంతినగర్, ఆదిలాబాద్

వీధి కుక్కల దాడిలో యువతికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతి

పెంబి: మండలంలోని తాటిగూడ గ్రామానికి చెందిన యువతి ఇంటి నుంచి బటయకు వస్తున్న క్రమంలో ఒక్కసారిగా వీధి కుక్క దాడిలో యువతి చేతికి గాయాలయ్యారు. అక్కడే స్థానికులు కుక్కను తరిమేసి యువతిని పెంబి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలి

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి కాలనీల కు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని బీజే పీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు అన్నా రు. బుధవారం సీతారాంపల్లిలోని ఫిల్టర్‌బెడ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిల్టర్ బెడ్ పని చేయక నాలుగు నెలలు కావస్తున్నా సింగరేణి యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ఫిల్టర్‌కాని నీరు తాగి ఈ ప్రాంత ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అగల్ డ్యూటీ రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రంగారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఈర్ల సదానందం, నాయకులు మిట్టపల్లి మొగిలి, అడిచెర్ల రూపాదేవి, తిప్పని భీమయ్య, రావుల లక్ష్మణ్, కొంతం మహేందర్, తరాల విజయ్, నారగోని సతీశ్, రాజు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఒకరి ఆత్మహత్య

ఆసిఫాబాద్: మద్యం మత్తులో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. మండలంలోని చిలాటిగూడకు చెందిన చౌదరి ఏమాజి (28) హమాలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిస కావడంతో ఇంట్లో తరచూ గొడవపడుతుండేవాడు. మంగళవారం సాయంత్రం మద్యం మత్తులో ఇంట్లోని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించగా పరిస్థితి విషమించడంతో రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య శారద ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పంట మార్పిడితో లాభాలు


నాగరాజు, ఏవో


హార్వెస్టర్ ద్వారా వరి కోత

నిర్మల్‌చైన్‌గేట్: ఒకే పంటను భూమిలో ఏళ్ల తరబడిగా పండిస్తే సమస్యలు ఎదురవుతాయి. చీడపీడల తాకిడి అధికమవుతుంది. భూమి సైతం నిస్సారంగా మారుతుంది. పంట మార్పిడి ద్వారా ఈ సమస్యను అధికమించవచ్చని ఏవో నాగరాజు సూచిస్తున్నారు. వేర్వేరు పంటలు సాగు చేస్తే రైతులకు దిగుబడి పెరగడంతో పాటు భూమిలో సారం పెరుగుతుందని, చీడ పీడల బెడద తక్కువగా ఉంటుందని పేర్కొంటున్నారు. పంట మార్పిడికి సంబంధించి సూచనలు, సలహాలు ఆయన మాటలల్లోనే...

ఇలా చేసుకోవచ్చు..

యాసంగిలో వేరుశనగ వేసుకునే రైతులు తర్వాత వచ్చే వానాకాలంలో మొక్కజొన్న పంట వేసుకుంటే పైరుకు కొంత నత్రజని లభిస్తుంది. దీంతో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించొచ్చు. కంది, శనగ పైర్లను వరుసగా వేస్తే కాయ తొలుచు పురుగుల తాకిడి అధికంగా ఉంటుంది. అందుకే ఈ పురుగులు తక్కువగా ఆశించే జొన్న, సోయాచిక్కుడు, నువ్వులు, మినుము, ఉలవ, మొట్ట వరి వంటి పంటలతో మార్పిడి చేసుకోవాలి. వరితో పంట మార్పిడి చేసుకుంటే వేరుశనగ పైరుకు నులిపురుగుల బెడద తగ్గుతుంది. వరుసగా పొద్దుతిరుగుడు పంటను సాగు చేసే వారు కొర్ర, జొన్న, సజ్జ చిరు ధాన్యాపు పంటలను లేదా కంది, శనగ, మినుము వంటి అపరాల పైర్లు లేదా వేరుశనగతో పంట మార్పిడి చేసుకోవచ్చు. వంగతోట వేసిన రైతులు కాలీ ఫ్లవర్‌తో పంట మార్పిడి చేసుకుంటే వంగకు ఎండు తెగులు సోకదు.

ధాన్యం పంటలతో..

దోస, కాకర, గుమ్మడి, పొట్ల, బీర, బూడిద గుమ్మడి, దొండ వంటి తీగ జాతి కూరగాయల పంటలను వరి పైరుతో పంట మార్పిడి చేసుకోవాలి. ఉల్లిసాగు చేసే వారు ధాన్యపు పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి. ఒకసారి పసుపు సాగు చేసిన వారు రెండేళ్లపాటు భూమిలో పసుపు సాగు చేయకూడదు. ఒక వేళ చేస్తే దిగుబడి తగ్గుతుంది. చీడపీడల బెడద పెరుగుతుంది. వరి, చెరుకు, అరటి, తమలపాకు, కూరగాయల పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి. పసుపు తర్వాత వరి, జొన్న వేసుకుంటే నులిపురుగుల ఉధృతి తగ్గుతుంది. మిరప, వేరుశనగ, క్యాబేజి, పంటల్ని ఆశించే లద్దె పురుగు తాకిడి అరికట్టాలంటే జొన్న, వరి, సజ్జ, రాగి, పొద్దుతిరుగుడు ఆరుతడి పంటలతో మార్పిడి చేయాలి.

ఇలా చేయొద్దు...

పంట మార్పిడి చేసే సమయాల్లో అనుకూలమైన పంటనే ఎంచుకోవాలి. లేదంటే చీడ పీడల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. బెండ తర్వాత పత్తి వేస్తే ఉపయోగం ఉండదు. ఎందుకంటే ఈ రెండు పంటలకు ఒకే రకమైన చీడపీడలు ఆశిస్తాయి. జొన్న వేసిన పొలాల్లో మిరప వేయకూడదు. పసుపు తర్వాత మిరప, టమాటా, క్యాబేజి, దోస, గుమ్మడి, సోర, బీర, పత్తి, ఆవాలు, బెండ వేసుకోకూడదు.

ఎంపికలో జాగ్రత్తలు..

పంట మార్పిడి చేయాలంటే అంతకు ముందు వేసిన పంటకు భిన్నంగా పెరిగే పైరును ఎంచుకోవాలి. కొన్ని పంటల వేరు వ్యవస్థలు నేలలోని పొరల నుంచి పోషకాలన్నీ ఎక్కువగా గ్రహిస్తాయి. కాబట్టి పోషకాలన్నీ ఎక్కువగా గ్రహించే నువ్వులు, పొద్దు తిరుగుడు, మొక్కజొన్న పంటలకు బదులుగా భూమికి పోషకాలను గ్రహించే సమకూర్చే అపరాల పంటలతో పంట మార్పిడి చేసుకుంటే ఫలితం ఉంటుంది. అపరాల పంటలు కరువు పరిస్థితులను తట్టుకుంటాయి. ఆకుల్ని రాల్చి భూమికి సేంద్రియ పదార్థాన్ని అందిస్తాయి. అపరాల పైరుల మీద ఉండే బుడిపెలు వాతావరణంలోని నత్రజనిని స్థిరీకరిస్తాయి. సూక్ష్మజీవుల చర్యతో ఎంజైముల ఉత్పత్తి పెరుగుతుంది. నల్లరేగడి నేలల్లో సోయ చిక్కుడు వేసుకుంటే పైరు కోత సమయానికి ఆకులు పూర్తిగా రాలుతాయి. తద్వారా ఎకరానికి ఒకటి నుంచి రెండు టన్నుల సేంద్రియ పదార్థం లభిస్తుంది.

భళా.. చిన్నారుల నాట్యకళ



- సంప్రదాయ నాట్యంపై చిన్నారుల మక్కువ
- తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ముందుకు
- ప్రతిభ చాటుతూ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు
- పలు ప్రదర్శనల్లో నిర్మల్ చిన్నారులు

నిర్మల్‌ఖిల్లా: పిల్లలను చదువుల యంత్రాలుగా చూస్తున్న కాలం ఇది. రోజూ బండెడు పుస్తకాలు మోస్తూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు అని పిల్లలపై భరించలేని ఒత్తిడిమోపే ఈ కాలంలో నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన పలువురు చిన్నారులు చదువుతో పాటు సంప్రదాయ నృత్యంలో రాణిస్తున్నారు. వారి అభిరుచిని గమనించిన తల్లిదండ్రులు ఆ దిశగా వారిని ప్రోత్సహిస్తున్నారు. ఫలితంగా వారు రాష్ట్ర స్థాయిలో ప్రదర్శనలు ఇచ్చి అవార్డులు, రివార్డులు సాధిస్తున్నారు. విద్యార్థులు సైతం తమకు నచ్చిన కళలో ఆరితేరేందుకు కృషి చేస్తున్నారు. వివిధ వేదికలపై తమ అభినయంతో ఆకట్టుకుంటున్న పలువురు చిన్నారులపై 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.


నాట్యనంది పురస్కారం స్వీకరిస్తున్న చిన్నారి సంగారి ఆరాధ్య

కూచిపూడిలో నాట్యనంది..

నిర్మల్ పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన చిన్నారులు దాయత్రి సహస్ర, సంగారి ఆరాధ్య కూచిపూడిలో రాణిస్తున్నారు. ×దాయత్రి సహస్ర¤ ప్రస్తుతం మూడో తరగతి పూర్తయింది. స్థానిక ఎస్వీఎస్ పాఠశాలలో చదువుతున్న 9 ఏళ్ల ఈ చిన్నారి తల్లిదండ్రులు దాయత్రి సుహాసిని-కిషోర్ కుమార్ కూతుర్ని కూచిపూడిలో శిక్షణ ఇప్పిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఇదే కాలనీకి చెందిన సంగారి ఆరాధ్య స్థానిక సెయింట్ థామస్ పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. వీరి తల్లిదండ్రులు స్వరూప-శ్రీనివాస్‌లు చిన్నారికి ఇష్టమైన కళ అయిన నృత్యంలో శిక్షణ ఇప్పిస్తూ ప్రోత్సహిస్తున్నారు. వీరు హైదరాబాద్లోని త్యాగరాయ గానసభలో శిఖరం ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సంప్రదాయ నృత్య పోటీలలో ఈ ఇద్దరు చిన్నారులు ప్రతిభ కనబరిచారు. శివోహం పేరిట నిర్వహించిన ఈ ప్రదర్శనలో చిన్నారులు తమప్రతిభతో ×నాట్య నంది¤ పురస్కారాన్ని కైవసం చేసుకున్నారు.

స్వరూపిణి డ్యాన్స్ అకాడమిలో శిక్షణ...

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే చిన్నారులు కూచిపూడిలో రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందుతున్నారు. విద్యార్థులకు శాస్త్రీయ నిత్యం పై అవగాహన పెంచేందుకు కనుమరుగవుతున్న సంప్రదాయ నృత్యాలకు మళ్లీ పునరుజ్జీవం పోసేందుకు చిన్నారులకు, యువతులకు శిక్షణ ఇస్తున్నారు నవ్య. స్వరూపిణి డ్యాన్స్ శిక్షణ పేరిట నిర్వహిస్తున్న ఈ శిక్షణ శిబిరంలో ఎంతోమంది చిన్నారులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి అనేక పురస్కారాలను అందుకున్నారు.

కూచిపూడిలో అక్కాచెల్లెళ్లు..

జిల్లా కేంద్రానికి చెందిన యాతాలం స్వప్న-చిన్నారెడ్డి దంపతులకు ఇద్దరు కుమార్తెలు చిన్న కూతురు ఆద్య మూడో తరగతి పూర్తికాగా పెద్ద కూతురు దీక్షిత తొమ్మిదో తరగతి పూర్తయింది. వీరిద్దరూ స్థానిక వాసవి హైస్కూల్‌లో చదువుతున్నారు. వీరికి కూచిపూడి నృత్యం అంటే చిన్నప్పటి నుంచి మక్కువ. గమనించిన వీరి తల్లిదండ్రులు ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. ఇటీవల రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో కీర్తి ఆర్ట్స్ అకాడమీ, శిఖరం ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో అక్కాచెల్లెళ్లు ×డాన్స్ ఆఫ్ ఎక్సెలెన్స్¤ అవార్డును సొంతం చేసుకున్నారు. చిన్నప్పటి నుంచే ఈ చిన్నారులు చదువుతో పాటు, నాట్యకళలో ఉత్తమ ప్రతిభను చూపడం పట్ల వీరి కుటుంబ సభ్యులతో పాటు పలువురు వీరిని అభినందిస్తున్నారు.

13 న ఓపెన్ ఇంటర్ ఎకనామిక్స్ పరీక్ష

మంచిర్యాలఅర్బన్: ఈ నెల 13 ఓపెన్ ఇంటర్ ఎకనామిక్స్ తెలుగు మీడియం పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2న తెలుగు మీడియంకు బదులుగా ఇంగ్లిష్ మీడియం పేపర్ రావడంతో పరీక్ష వాయిదా వేసినట్లు ఆయన పేర్కొన్నారు. తిరిగి 13న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గతంలో రాసిన కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈవో తెలిపారు.

ఎన్‌హెచ్ 63 బాధితుల దీక్ష కొనసాగింపు


సంఘీభావం తెలుపుతున్న డీసీసీ అధ్యక్షురాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల-ఆర్మూర్ నాలుగు వరుసల జాతీయ రహదారి 63 బాధితుల దీక్ష కొనసాగుతోంది. వేంపల్లి-ముల్కల్ల శివారులో దీక్షా శిబిరం ఏర్పాటు చేసి న్యాయం కోసం పోరు సాగిస్తున్నారు. రహదారి విస్తరణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండా, తమ అనుమతులు లేకుండా మా భూముల్లో సర్వే ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నారు.డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ బుధవారం దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. రైతుబంధు సమితి మండల కన్వీనర్ పూస్కూరి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ బొడ్డు శంకర్, నాతరి శ్రీనివాస్ ఎంపీ వెంకటేశ్‌నేతను కలిసి వినతిపత్రం అందజేశారు.